సాక్షి రంగారెడ్డి

శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



ఎక్కడున్నా ఓటు పక్కా

వలసదారుల ఓటు హక్కు విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. 8లో▸



ఫార్మాసిటీకి బీజేపీ వ్యతిరేకం

ఫార్మాసిటీకి బీజేపీ వ్యతిరేకమని, కేంద్రం నుంచి అనుమతులు లేవని ఆ పార్టీ దళిత మోర్చా అధ్యక్షుడు బాషా పేర్కొన్నారు. 8లో▸



ప్రయోగాత్మక విద్యతో లాభాలు

ప్రయోగాత్మక విద్యాబోధనతో పాఠ్యాంశాలు సులువుగా అర్థమవుతాయని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి సూచించారు. 8లో▸

న్యూస్‌రీల్

ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపిద్దాం

సంస్థ ఈడీ పురుషోత్తం నాయక్



ఉద్యోగులకు నగదు, ప్రశంసా పత్రాలు అందజేసిన ఈడీ పురుషోత్తం నాయక్

షాద్‌నగర్: ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఉద్యోగులు మరింత కృషి చేయాలని ఆ సంస్థ హైదరాబాద్ జోన్ ఈడీ పురుషోత్తం నాయక్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ డిపోను ఆయన సందర్శించారు. జనవరి నెలలో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మరోవైపు సంస్థ ఆదాయాన్ని పెంచుకునే మార్గాలపై దృష్టి సారించినట్లు తెలిపారు. బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఆర్‌ఎం శ్రీదేవి, డిప్యూటీ ఆర్‌ఎం సత్యనారాయణ, డిపో మేనేజర్ ఉష, సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలమందపై వీధికుక్కల దాడి

30 గొర్రెపిల్లల మృతి



మృతిచెందిన గొర్రెపిల్లలు

ఆమనగల్లు: మండల పరిధిలోని పోలెపల్లిలో శుక్రవారం సాయంత్రం దారుణం చోటుచేసుకుంది. గొర్రెల మందపై వీధికుక్కలు దాడిచేశాయి. ఈ ఘటనలో 30 గొర్రెపిల్లలు మృత్యువాతపడ్డాయి. పోలెపల్లికి చెందిన రైతు ఎట్టయ్యయాదవ్ తన పొలం వద్ద గొర్రెలను ఉంచగా అదే సమయంలో కుక్కలు దాడిచేశాయి. మందలో ఉన్న 30 గొర్రెపిల్లలు మృతి చెందాయి. సంఘటనాస్థలాన్ని ఎంపీటీసీ దోనాదుల కుమార్, గ్రామ రైతుకమిటీ అధ్యక్షుడు నర్సిరెడ్డిలు సందర్శించారు. బాధితుడిని ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.

అయ్యో పాపం

- రోజు వ్యవధిలో వృద్ధ దంపతులు మృతి
- తులేకలాన్‌లో విషాదం



దంపతులు సత్తయ్య, లక్ష్మమ్మ (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: వృద్ధ దంపతులు రోజు వ్యవధిలో మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని తులేకలాన్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తులేకలాన్‌కు చెందిన జక్కుల సత్తయ్య(75), లక్ష్మమ్మ (65) దంపతులు కొద్ది కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో గురువారం భర్త మరణించాడు. మరుసటి రోజు ఉదయం భార్య మృతిచెందింది. దంపతులిద్దరు రోజు వ్యవధిలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులను కోల్పోయిన వికలాంగుడు వెంకటేశ్ రోదనలు గ్రామస్తులను కలిచివేశాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

కాసుల వర్షం!

- రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రభుత్వానికి దండిగా ఆదాయం
- జోరుగా వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు
- ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ.3,253 కోట్లకు పైగా రాబడి
- జిల్లా వ్యాప్తంగా 2 లక్షలకు పైగా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు



షాద్‌నగర్‌లోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

షాద్‌నగర్: ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే శాఖల్లో రిజిస్ట్రేషన్ శాఖ ఒకటి. రియల్ వ్యాపారం జోరుగా సాగుతుండటంతో భారీగా ఆదాయం సమకూరుతోంది. వ్యవసాయేతర భూములు, ప్లాట్ల క్రయవిక్రయాలతో ప్రభుత్వానికి ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు రూ.3,253 కోట్ల ఆదాయం సమకూరింది.

భారీగా రిజిస్ట్రేషన్లు

పారిశ్రామికంగా,వాణిజ్యపరంగా జిల్లా రోజు రోజుకూ ఎంతో అభివృద్ధి చెందుతోంది. దీతో జిల్లాలో

కార్యాలయం	డాక్యుమెంట్లు	వచ్చిన ఆదాయం
షాద్‌నగర్	7,870	59.93 కోట్లు
ఫరూఖ్‌నగర్	14,822	74.91 కోట్లు
చేవేళ్ళ	9,711	76 కోట్లు
హయత్‌నగర్	6,321	56.15 కోట్లు
ఇబ్రహీంపట్నం	16,602	78.13 కోట్లు
రంగారెడ్డి ఆర్‌ఓ	20,256	900.61 కోట్లు
సరూర్‌నగర్	6,696	101.64 కోట్లు
చంపాపేట్	13,214	116.55 కోట్లు
పెద్ద అంబర్‌పేట	9,148	46.51 కోట్లు
రాజేంద్రనగర్	11,599	219.10 కోట్లు
మహేశ్వరం	19,104	180.95 కోట్లు
శంషాబాద్	10,051	75.91 కోట్లు
శేరిలింగంపల్లి	10,921	392.08 లక్షలు
శంకర్‌పల్లి	5,711	102.38 కోట్లు
గండిపేట్	13,610	592. 33 కోట్లు
ఎల్‌బీ నగర్	11,459	145.66 కోట్ల
వనస్థలిపురం	7,716	111.78 కోట్లు
అబ్దుల్లాపూర్‌మెట్	7,119	39.86 కోట్లు

రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఆరు నెలల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం కొంత నెమ్మదించినా ప్రభుత్వ ఖజానాకు రిజిస్ట్రేషన్‌శాఖ ద్వారా భారీగా ఆదాయం సమకూరింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు ఇంకా నెల రోజులకు పైగా సమయం ఉంది. అయితే ఇప్పటి వరకు రంగారెడ్డి ఆర్‌ఓ కార్యాలయంలో 20,256 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు అయ్యాయి. ఈ ఒక్క కార్యాలయం నుండే అత్యధికంగా రూ.900 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. అత్యల్పంగా శంకర్‌పల్లి సబ్‌రిస్ట్రేషన్ కార్యాలయంలో 5,711 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాగా ఆదాయం మాత్రం రూ.100 కోట్లు దాటింది. మొత్తం మీద ఇప్పటి వరకు 2,01,930 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా రూ. 3253 ఆదాయం వచ్చింది. ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు సుమారు మరో రూ.350 కోట్లు వచ్చే అవకాశాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. గత ఏడాది రూ.3559 కోట్ల ఆదాయం రాగా ఈసారి మరింత ఎక్కువ రాబడి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు జిల్లా పరిధిలో ఉన్న సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు, ఆదాయం వివరాలు

ఆర్‌ఆర్‌ఆర్‌తో పుంజుకోనున్న రియల్ వ్యాపారం

ప్రభుత్వం చేపడుతున్న రీజినల్ రింగ్ రోడ్డు జిల్లా పరిధిలోనూ నిర్మించనున్నారు. జిల్లాలోని శంకర్‌పల్లి, చేవెళ్ల, షాబాద్, షాద్‌నగర్, కడ్తాల్, ఆమనగల్లు, కొందుర్గు, కేశంపేట, మండలాల్లో ఉన్న గ్రామాల మీదుగా రీజనల్ రింగ్ రోడ్డును నిర్మించాలని ప్రభుత్వం సూచన ప్రాయంగా నిర్ణయించింది. ఈ రోడ్డు వచ్చే గ్రామాల పరిధిలో భూములను కొనుగోలు చేసే వెంచర్లను ఏర్పాటు చేసేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో ఈ మండలాల పరిధిలో ఎకరం భూమి ధర కోటి రూపాయలు పలుకుంది. రీజినల్ రింగ్ రోడ్డు ఏఏ గ్రామాల మీదుగా వెలుతుందో ఖరారు అయితే ఈ ప్రాంతంలో ప్లాట్ల ధరలకు కూడ మరింత పెరుగుతాయి.

మరింత పెరిగే అవకాశం



నిబంధనల ప్రకారం ఉన్న ప్రభుత్వ అనుమతులు ఉన్న లేఅవుట్‌లలో ప్లాట్లు, ఇళ్ల కొనుగోలు చేసేందుకు చాలా మంది ఆసక్తి కనబరుస్తున్నారు. ఈఆర్థిక సంవత్సరం ముగిసే వరకు వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్‌ల ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతుంది

– సతీష్‌కుమార్, సబ్ రిజిస్ట్రార్, ఫరూఖ్‌నగర్



ఇంటర్నేషనల్ స్పేస్ సదస్సుకు ఆహ్వానం పొందిన విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి సబితారెడ్డి

స్పేస్ సదస్సుకు మహేశ్వరం విద్యార్థులు

ఆహ్వానం రావడం గర్వకారణం: మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: స్థానిక ప్రభుత్వ మోడల్ స్కూల్ నుంచి తొమ్మిది మంది విద్యార్థులకు అమెరికా టెక్సాస్ నగరంలో నిర్వహించే ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం రావడం గర్వించదగ్గ విషయమని మంత్రి సబితారెడ్డి అన్నారు. అమెరికా నుంచి ఆహ్వానం అందుకున్న విద్యార్థులు శుక్రవారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ మోడల్ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆహ్వానం అందడం అభినందనీయమని, సర్కారు బడుల్లో నాణ్యతతో కూడిన విద్య అందుతుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. వారం రోజుల్లో ఐటీ మంత్రి కేటీఆర్‌ను కలుద్దామని మంత్రి విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బాబు, మాజీ ప్రిన్సిపాల్ బి. ధనుంజయ్, కేసీ తండా సర్పంచ్ మోతీలాల్ నాయక్, ఉప సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ రవినాయక్, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

రెండు ప్రైవేట్ ఆస్పత్రులు సీజ్

చేవెళ్ల: అనుమతులు లేకుండా గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేస్తున్న రెండు ప్రైవేటు ఆస్పత్రులను జిల్లా వైద్యాధికారులు సీజ్ చేశారు. శుక్రవారం సాయంత్రం జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి మండల కేంద్రంలో ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. సిద్ధార్థ క్లీనిక్ పేరుతో హోమియోపతి డాక్టర్ హైమావతి నిర్వహిస్తున్నారు. ఈ ఆస్పత్రిలో గర్భిణులకు స్కా నింగ్‌పరీక్షలు, లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో దాడులు చేశారు. క్లినిక్‌లో 12 మంది గర్భిణులు స్కానింగ్ కోసం రావడాన్ని అధికారులు గమనించారు. అనుమతులులేకుండా స్కానింగ్ చేసినందుకు మిషన్లను సీజ్ చేశారు. మరో ప్రైవేటు ఆస్పత్రి అయిన ప్రజావైద్యశాలలో కూడా ఇదేరకమైన స్కానింగ్ పరీక్షలు జరుగుతున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. ఈ రెండు ప్రైవేటు ఆస్పత్రులను సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఆకస్మిక తనిఖీల్లో వైద్యఅధికారులు రాకేశ్, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌లు, సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, చేవెళ్ల ఎస్‌ఐ హయ్యూం, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.



సిద్ధార్థ ఆస్పత్రిని సీజ్ చేస్తున్న జిల్లా వైద్యాధికారులు

‘మనబడి’ని సిద్ధం చేయండి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

- పనులు త్వరగా పూర్తిచేయాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మన ఊరు– మనబడి పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హరీశ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన అదనపు కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ‘మనబడి’, దళిత బంధు, పోషణ అభియాన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు చదువుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సివిల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దళిత బంధు ద్వారా జిల్లాలో 697 యూనిట్లుకు గాను 694 యూనిట్లను గ్రౌండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రౌండింగ్ అయిన యూనిట్లతో దళిత కుటుంబాలు ఎలా ఉపయోగించుకుంటున్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదికలు అందించాలన్నారు. మిగిలిన యూనిట్లను వెంటనే గ్రౌండింగ్ చేస్తామని ఎస్సీ కార్పొరేషన్ అధికారి ప్రవీణ్ రెడ్డి ఈ సందర్భంగా కలెక్టర్‌కు తెలిపారు. జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో నీటి సదుపాయం, మరుగుదొడ్ల ఏర్పాట్లు తప్పకుండా చేపట్టాలన్నారు. గర్భిణులకు పోషక ఆహారంతో పాటు అవసరమైన మందులను అందజేయాలని తెలిపారు. గర్భిణుల్లో, పిల్లల్లో రక్తహీనత తగ్గించేందుకు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పిల్లల బరువు, ఎత్తు, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి మోతి, ఈఈ పీఆర్, సంబంధిత ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులు, సీడీపీఓలు పోషన్ అభియాన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలకు శిక్షణ అవసరం

- కార్మిక శాఖ కమిషనర్ డాక్టర్ గంగాధర్

షాబాద్: ఉపాధి అవకాశాలు పొందేందుకు శిక్షణ ఎంతో అవసరం కార్మిక శాఖ కమిషనర్ డా. ఎల్ గంగాధర్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండలం కక్కులూర్ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఏజైల్ సెక్యూరిటీ ఫోర్స్ ట్రైనింగ్ అకాడమీ మొదటి బ్యాచ్ పాసింగ్ అవుట్ పెరేడ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అకాడమీ డైరెక్టర్ వీఆర్‌కే రావు మాట్లాడుతూ.. తమ అకాడమీలో శిక్షణ పొందిన గార్డులందరికీ తప్పని సరిగా ప్లేస్‌మెంట్ లభించిందని తెలిపారు. ఇక్కడ అభ్యర్థులకు శారీరక, వృత్తిపరమైన, ఉద్యోగ శిక్షణ ఇస్తామని చెప్పారు. 81 మంది అభ్యర్థులు పీఎస్‌ఏఆర్‌ఏ చట్టం ప్రకారం నిరాయుధ సెక్యూరిటీ గార్డ్‌గా నైపుణ్యం సాధించి అకాడమీ నుంచి ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. వరందరికీ ఎజైల్ గ్రూప్‌లో వందశాతం ప్లేస్‌మెంట్ లభించిందన్నారు. మార్చి 2023 నుంచి తదుపరి ఇన్‌టెక్ నుంచి 250 మంది అభ్యర్థులకు వసతి కల్పించాలని ప్లాన్ చేసినట్లు వివరించారు. అభ్యర్థులకు శారీరక, వృత్తిపరమైన, ఉద్యోగ శిక్షణను అందిస్తామన్నారు. సమర్థవంతమైన భద్రతగా ఉండటానికి అవసరమైన నైపుణ్యాలను వారికి అందిస్తామన్నారు. భౌతిక, మౌలిక భద్రతా అవసరాలకు సంబంధించిన అన్ని రంగాల్లో సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈపీఎస్‌సీ సీనియర్ మేనేజర్ అభిషేక్ సక్సేనా, అసోసియేషన్ ఆఫ్ ప్రైవేట్ ఏజెన్సీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, షాబాద్ సీఐ గురువయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్కులు పదిలం.. ఖాళీస్థలాలు భద్రం

- ఆధునిక టెక్నాలజీతో సర్కారు ఆస్తులు సురక్షితం
- ఆదిబట్ల మున్సిపాలిటీలో క్యూఆర్ కోడ్ అమలు
- జిల్లాలో తొలిసారిగా ఆధునిక ఒరవడికి శ్రీకారం



ఆదిబట్ల మున్సిపాలిటీలోని పార్కు స్థలం

ఇబ్రహీంపట్నం రూరల్: పార్కులు, ఖాళీ స్థలాల రక్షణకు ఆదిబట్ల మున్సిపాలిటీ ఆధునిక టెక్నాలజీని రూపొందించింది. లే అవుట్ల వివరాలు, రూట్ మ్యాప్‌లు, లేఅవుట్ కాపీలను ఆన్‌లైన్‌లో ఉంచారు. మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లి క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఏ పార్కు ఎక్కడ ఉంది? ఖాళీ జాగా కనిపిస్తుందా లేక ఎవరైనా కబ్జా చేశారా? అనేది తెలిసిపోతుంది. జిల్లాలోనే ఆధునిక ఒరవడికి శ్రీకారం చుట్టారు. మున్సిపాలిటీ జాగాలను కాపా డటానికి అధికారులు వినూత్న కార్యక్రమం చేపట్టారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే..

ఆదిబట్ల మున్సిపాలిటీలో ఉన్నటువంటి పార్కు స్థలాలు ఎన్ని? ఎక్కడెక్కడ పార్కు స్థలాలు ఉన్నాయో జియోట్యాగింగ్ చేశారు. ఫోన్ ద్వారా స్కాన్ చేస్తే నేరుగా పలనా వార్డులో పలాన పార్కు స్థలం వద్దకు రూట్ మ్యాఫ్ చూపెడుతుంది. ఆదిబట్ల మున్సిపాలిటీలో ప్రస్తుతం 313 లేఅవుట్లల్లో 313 పార్కు స్థలాలు ఉండగా వీటి విస్తీర్ణం 112 ఎకరాలుగా ఉంది. అంటే మున్సిపాలిటీలోని 15 వార్డుల్లో ఉన్నటువంటి భూములకు ధరలు ఉండటంతో వాటిని కాపాడటం కోసం ఇలాంటి టెక్నాలజీని ఉపయోగించారు. జిల్లాలో మొదటి సారిగా ఆదిబట్ల మున్సిపాలిటీలోనే ఈ టెక్నాలజీని ఉపయోగించారు. మూడు నెలల క్రితమే ఈ విధానం అందుబాటులోకి వచ్చింది.

అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకే..

నిన్న మొన్నటి వరకు ఆన్‌లైన్ లేకుండా ఆఫ్‌లైన్ ఉండటం వలన మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో పార్కు స్థలాలు, ఖాళీ స్థలాలు కబ్జాలకు గురవుతూ వస్తున్నాయి. చాలా చోట్ల అధికారులు, కబ్జా రాయుళ్లు కలిసి పార్కు స్థలాలను అమ్ముకున్న ఘటనలు సైతం లేకపోలేదు. అధికారులు మారినా వివరాలు మాత్రం అందిరికీ తెలిసేలా ఉండేందుకు ఇలాంటి సాంకేతిక ఎంతో ఉపయోగపడుతుంది. అభివృద్ధి చెందుతున్న ఆదిబట్ల మున్సిపాలిటీలో ఆధునిక వరవడికి శ్రీకారం చుట్టడం తో పట్టణ పౌరులు అభినందిస్తున్నారు. మున్సిపాలిటీ ఆస్తులను పక్కగా చూసుకోవడానికి క్యూఆర్ కోడ్ విధానం తీసుకురావడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ ఆస్తులు కాపాడేందుకే..



రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో క్యూఆర్‌కోడ్ విధానం అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. మొదటి సారిగా ఆదిబట్ల మున్సిపాలిటీలో అమలు చేశాం. సర్కారు ఆస్తుల వివరాలను అందుబాటులోకి తెచ్చాం. ప్రభుత్వ ఆస్తులు కాపాడటమే లక్ష్యంగా అమలు చేస్తున్నాం. అన్ని మున్సిపాలిటీల్లో త్వరలోనే అందుబాటులోకి రానుంది.

– కె. అమరేందర్‌రెడ్డి, కమిషనర్ ఆదిబట్ల

అధికారుల కృషి అభినందనీయం



మున్సిపాలిటీ ఆస్తులు ఇప్పటికే చాలా ప్రాంతాల్లో అన్యాక్రాంతం అవుతున్నాయి. ఆదిబట్లలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. గజం రూ.50 వేల నుంచి లక్షా రూపాయల వరకు పలుకుతుంది. అలాంటి తరుణంలో ఉన్నా అస్తులు కాపాడటం చాలా అవసరం. అధికారులు తీసుకున్న నిర్ణయం అభినందనీయం.

– పయ్యిళ్ల శ్రీధర్‌రెడ్డి, బొంగ్లూర్

బస్సును ఆపి..కంట్లో కారం చల్లి

- పట్టపగలు రూ.10 లక్షలు దోపిడీ

రాజేంద్రనగర్: సినీ ఫక్కీలో ఆర్టీసీ బస్సును అడ్డగించిన ఓ యువకుడు బస్సులో ప్రయాణిస్తున్న యువకుడి కంట్లో కారం చల్లి రూ.10 లక్షల నగదు, వెండి వస్తువులతో కూడిన బ్యాగ్‌ను లాక్కెళ్లిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట్ ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్ ఇంటి వద్ద బంగారు, వెండి ఆభరణాలను తయారు చేస్తుంటాడు. ప్రతి నెల రెండు మూడు సార్లు అతను బంగారం కొనుగోలు చేసేందుకు, తయారు చేసిన వెండి వస్తువులను బేగంబజార్‌లోని హోల్‌సేల్ దుకాణాలకు అందజేసేందుకు ఆర్టీసీ బస్సులో నగరానికి రాకపోకలు సాగిస్తుంటాడు. ఇదే తరహాలో శుక్రవారం ఉదయం రూ.10 లక్షల నగదు, వెండి వస్తువులను తీసుకుని నారాయణపేట్ నుంచి ఆర్టీసీ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. బస్సు ఆరాంఘర్ చౌరస్తా నుంచి నేషనల్ పోలీస్ అకాడమీ దాటి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుంది. రోడ్డుపై బస్సును ఆపి లోపలికి వచ్చిన ఓ యువకుడు నేరుగా శివ వద్దకు వెళ్లి అతడి కంట్లో కారం చల్లి బ్యాగు లాక్కున్నాడు. దీంతో అప్రమత్తమైన కండక్టర్ శ్రీధర్ అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా తోసివేయడంతో కండక్టర్ కిందపడ్డాడు.తెరుకున్న శివ దొంగ దొంగ అని కేకలు వేస్తూ బస్సులో నుంచి కిందకు దిగి సదరు యువకుడిని వెంబడించేందుకు ప్రయత్నించగా, అతను తన వద్ద ఉన్న కత్తితో బెదిరించి రోడ్డు దాటి ఆ పక్కనే బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో యువకుడితో కలిసి అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితుడు, బస్సు కండక్టర్ శ్రీధర్ రోడ్డుపైకి వచ్చి విషయం చెప్పడంతో అప్రమత్తమైన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి రాజేంద్రనగర్, బహదూర్‌పురా, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు చేరుకున్నారు. సంఘటనా స్థలం రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడంతో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలిసిన వారి పనే...

శివ తరచూ పెద్ద మొత్తంలో నగదు, వెండి వస్తువులతో నగరానికి రాకపోకలు సాగిస్తుండటంతో తెలిసిన వారే ఈ దోపిడీకి పాల్పడి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. నిందితుడు నేరుగా శివ వద్దకు వెళ్లి బ్యాగు లాక్కుని ఉడాయించడాన్ని బట్టి తెలిసిన వారి పనే అని పోలీసులు అంచనా వేస్తున్నారు. శివ మొదట తనకు ఎవరిపై అనుమానం లేదని చెప్పినప్పటికీ విచారణలో ముగ్గురు పేర్లు వెల్లడించినట్లు సమాచారం. బాధితుడి సమాచారంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సంఘటనా స్థలంతో పాటు దోపిడీ అనంతరం నిందితుడు వెళ్లిన దారిలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ. 6లక్షల విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఉమాకాంతం

శంకరపల్లి: పట్టణంలో అయ్య ప్ప ఆలయం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సాత ప్రవీణ్‌కుమార్ కోరారు. శుక్రవారం శంకర్‌పల్లికి చెందిన జీ ఉమాకాంతం అయ్యప్ప ఆలయం నిర్మాణానికి రూ. 6లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప ఆలయం నిర్మాణానికి భక్తులు ముందుకు రావాలన్నారు. బీఆర్ఎస్ మున్సిపల్ యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి, నాయకులు శ్రీనివాస్, కే జంగయ్య, శ్రీనివాస, రాంరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై ఫిర్యాదు చేయండి

మానవ హక్కుల కమిషన్ దక్షిణ భారత రాష్ట్రాల ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి



పురుషోత్తంరెడ్డిని సన్మానిస్తున్న కాలనీ వాసులు

షాద్‌నగర్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్, దక్షిణ భారత రాష్ట్రాల ఉపాధ్యక్షుడు వర్ధిరెడ్డి పురుషోత్తంరెడ్డి అన్నారు. శుక్రవారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని శ్రీ సాయి బాలాజీ టౌన్‌షిప్ కాలనీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వెంచర్‌లో డ్రైనేజీ పనులు చేపట్టారని, అదేవిధంగా పార్కులను అభివృద్ధి చేయలేదని వివరించారు. మురుగు నీటిని రీసైక్లింగ్ చేసే యంత్రాలను ఏర్పాటు చేస్తామని వెంచర్ నిర్వాహకులు హామీ ఇచ్చి నెరవేర్చలేదని ఫిర్యాదు చేశారు. నాసిరకం పైపులతో డ్రైనేజీ నిర్మించి పైప్‌లైన్‌పై మొక్కలు నాటారన్నారు. మొక్కలు పెరిగి వృక్షాలుగా మారడంతో డ్రైనేజీ పైపులు పగిలిపోతున్నాయని, దీంతో కాలనీలోకి మురుగు నీరు చేరుతోందని తెలిపారు. కాలనీలో తరచూ విద్యుత్ సమస్యలు ఎదురవుతున్నట్లు చెప్పారు. అనంతరం పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. కాలనీ వాసులు సమస్యలతో కూడిన పత్రాలపై సంతకాలు చేసి మానవ హక్కుల కమిషన్ ప్రధాన కార్యాలయంలో ఫిర్యా దు చేయాలని సూచించారు. కమిషనర్ జాయింట్ సెక్రటరీ విజయేందర్‌రెడ్డి, రాంరెడ్డి, దా మోదర్‌రెడ్డి, మాధవరెడ్డి, అమర్నాథ్, రాజిరెడ్డి, ప్రభాకర్‌చారి, రాఘవేందర్‌రెడ్డి, ప్రభాకర్‌చారి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, జగన్, ప్రకాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT : SHADNAGAR.
I.A.NO. 136 OF 2023
IN
O.S.NO. 254 OF 2022

Between:
Smt Sahajan and others ...Plaintiffs
AND
The Tahsildar Kothur Mandal ...Defendants

To,
To whom so ever it may Concern.

Take notice that the above suit is filed by the plaintiffs to declare that they are the legal heirs to Late Rahim Bheg @ Raheem Baig S/o Gokar Baig, R/o Thimmapur, Kothur Municipality, Rangareddy District and the said suit is posted for 07-03-2023 for objections, if anybody having any objections they shall submit objections before the Hon'ble Principal Junior Civil Judge's Court at Shadnagar on 07-03-2023 at 10:30 am.

//By Order of the Court//
K. Sreenivas Goud Advocate,
Shadnagar,Rangareddy Dist
Cell No. 9848069895

ఎక్కడున్నా ఓటు పక్కా

- నూతన విధానానికి కేంద్ర ఎన్నికల సంఘం శ్రీకారం
- వలసదారులు, కూలీలకు వెసులుబాటు
- ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికే అవకాశం



షాబాద్: వలసదారుల ఓటు హక్కు విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. స్వగ్రామంలో ఓటు హక్కు ఉన్నా బతుకు దెరువు కోసం సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన వారు ఎన్నికల సమయంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల రాలేకపోవడం.. ఓటు హక్కు వినియోగించుకోలేకపోవడం వంటి కారణాలను గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం ఇలాంటి వారు ఉన్నచోటే ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పించనుంది. దీంతో జిల్లా నుంచి వలస వెళ్లిన వ్యక్తులకు ఎన్నికల సమయంలో ఓటు వేసేందుకు అవకాశం లభించనుంది. వ్యవసాయాధారిత జిల్లా కావడం పల్లెలు ఎక్కువగా ఉండడం.. వ్యవసాయ పనులు లేని సమయంలో పొట్టచేత పట్టుకుని హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి స్వగ్రామానికి వచ్చేందుకు ఆర్థిక భారం పడటం.. సుదూర ప్రాంతాల నుంచి రాలేక ఓటు వేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఓటింగ్ శాతం పడిపోయిన సందర్భాలున్నాయి. అయితే కేంద్ర ఎన్నికల సంఘం తీసుకురానున్న నూతన విధానం వల్ల ఉన్న చోటు నుంచే ఓటు వేసే రిమోట్ ఓటింగ్ సిస్టం ద్వారా అధిక శాతం నమోదుకు ఎన్నికల కమిషన్ ప్రయత్నిస్తోంది. ఓటర్లు తాము ఉంటున్న ప్రాంతాల నుంచే ముందస్తుగా ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారు.

పెరగనున్న ఓటింగ్

కేంద్ర ఎన్నికల సంఘం తీసుకొస్తున్న నూతన విధానం వల్ల జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉంది. ప్రతీ ఎన్నికల సమయంలో ఆయా నియోజకవర్గాలకు చెందిన ఓటర్లు ఇతర ప్రాంతాల్లో నివసిస్తుండటం వల్ల ఓటు హక్కు వినియోగించుకోలేక పోతున్నారు. కేంద్రం తీసుకొచ్చే నూతన విధానం ఓటర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఓటింగ్ ఎక్కువగా ఉంటుంది



రిమోట్ ఓటింగ్ విధానం అమలులోకి వస్తే ఓటింగ్ శాతం పెరగడంతో పాటు ఎన్నికల ఫలితాల్లో కూడా స్పష్టమైన తీర్పు ఉంటుంది. వీరిని ఎన్నికల సమయంలో స్వగ్రామాలకు రప్పించడం సాధ్యం కావడం లేదు. ఒకవేళ రప్పించినా అభ్యర్థులపై భారం పడుతుంది.

– భార్గవరామ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి

వలన కూలీలకు ఉపయోగం



జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తారు. ఎన్నికల సమయంలో ఓటు హక్కు ఉన్న చోటకు వచ్చి ఓటు వేయడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుంటాయి. నూతన విధానంతో వలస కూలీల ఇబ్బందులు తొలగుతాయి.

– నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు

ఈ విధానం బాగుంటుంది



దూర ప్రాంతాల్లో విద్యనభ్యసించే యువత ఎన్నికల సమయంలో వచ్చేందుకు ఇబ్బంది పడుతుంటారు. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం నూతనంగా తెచ్చిన విధానంతో ఉన్న చోట నుంచే ఓటు హక్కు వినియోగించుకుంటారు. పోలింగ్ శాతం పెరుగుతుంది.

– రాము, స్వచ్ఛ భారత్ సెల్ రాష్ట్ర కన్వీనర్

ఫార్మాసిటీకి బీజేపీ వ్యతిరేకం

భూసేకరణలో కుంభకోణాలు

- మేం అధికారంలోకి వస్తే విచారణ జరిపిస్తాం
- పార్టీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కొప్పు బాషా

యాచారం: ఫార్మాసిటీకి బీజేపీ పూర్తి వ్యతిరేకమని, కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవని ఆ పార్టీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా పేర్కొన్నారు. మండలంలోని నానక్‌నగర్ గ్రామంలో గురువారం రాత్రి ప్రజా గోస – బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీ పేరుతో కేసీఆర్ సర్కార్ పేదల అసైన్డ్ భూములను తీసుకుని రియల్ వ్యాపారం చేసిందన్నారు. కొంత మంది రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతలు కలిసి భూసేకరణలో అక్రమాలు, అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. వందలాది ఎకరాలను బీనామిల పేర్ల మీద డబ్బులిచ్చి కోట్లాది రూపాయల కుంభకోణాలకు పాల్పడ్డారని అన్నారు. ఫార్మాసిటీ వ్యతిరేక ఉద్యమానికి బీజేపీ అండగా ఉంటుందన్నారు. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ సేకరణలో జరిగిన అక్రమాలపై పూర్తి విచారణ చేపడతామని పేర్కొన్నారు. యాచారం మండలంలో మైనింగ్ జోన్, కొత్తపల్లి గ్రామంలో బొక్కల కంపెనీని మూసేయాలని ఎలా ఆందోళన, నిరాహార దీక్షలు చేస్తున్నారో.. అదే తరహాలో ఫార్మాసిటీ రద్దు కోసం ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుప్పాల శాంతికుమార్, మండల ప్రధాన కార్యదర్శి సంగెం శ్రీనాథ్, నాయకులు మంద శేఖర్, నల్లోల వెంకటేష్, కట్టెల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాత్మక విద్యతో లాభాలు

సీఎంఓ కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సీఎంఓ కృష్ణయ్య

కొత్తూరు: ప్రయోగాత్మకంగా విద్యాబోధన చేపడితే విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థమవుతాయని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి (సీఎంఓ) కృష్ణయ్య సూచించారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో పీఅండ్‌జీ పరిశ్రమ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పరిశ్రమ ఆర్థిక సహకారంతో మైండ్ స్పార్క్ సంస్థ సమకూర్చిన కంప్యూటర్ మోడల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు దృశ్య, వీక్షణ ద్వారా పాఠ్యాంశాలు బోధిస్తే వారికి విషయ పరిజ్ఞానం పెరగడంతో పాటు చాలాకాలం వరకు గుర్తుంటాయన్నారు. కరోనా కారణంగా చదువులో వెనకబడిన విద్యార్థులకు ఇలాంటి బోధన ఎంతో ఉపయోగకరమని అన్నారు. విద్యాభివృద్ధికి పీఅండ్‌జీ పరిశ్రమ తమ సహకారాన్ని ఎప్పటికీ అందిస్తుందని హెచ్ఆర్ డైరెక్టర్ ఆశిష్ డొంగారియా, ఆపరేషన్స్ మేనేజర్ అనీష్ కులకర్ణి పేర్కొన్నారు. కార్యక్రమంలో మైండ్ స్పార్క్ సంస్థ ప్రతినిధి విశ్వనాథ్, ఎంఈవో కృష్ణయ్య, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి కూలీకి ఉపాధి పని కల్పిస్తాం

డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్



చింతపట్లలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్

యాచారం: జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పిస్తామని డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్ పేర్కొన్నారు. మండలంలోని చింతపట్ల గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం ఎన్ని గంటలకు పనులకు వస్తున్నారు, పనులు ప్రారంభించే సమయంలో, పనులు చేసే సమయంలో ఫొటోలు తీస్తున్నారా.. నింబంధనల ప్రకారం పనులు చేస్తున్నారా.. రికార్డుల నమోదు, కూలీల సంఖ్యపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని బృహత్ పల్లె ప్రకృతి వనం, నర్సరీలను సందర్శించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా వారానికి మూడు రోజుల పాటు నీళ్లు అందించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా రోజూ 7 వేల మందికి పైగా కూలీలకు ఉపాధి పనులకు వస్తున్నారని తెలిపారు. రాబోయే వారం, పది రోజుల్లో ప్రతి గ్రామంలో 250కి మించి కూలీలు ఉపాధి పనులు చేసేలా చైతన్యం కల్పిస్తామన్నారు. కూలీలకు వారం, వారం డబ్బులు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ రుద్రాక్ష మాల బహూకరణ



ఆలయ సిబ్బందికి స్వర్ణ రుద్రాక్ష మాలను అందజేస్తున్న మంజుల, ప్రతాప్‌కుమార్ తదితరులు

షాద్‌నగర్ టౌన్: పట్టణంలోని శివమారుతీ ఆలయంలో కొలువుదీరిన అయ్యప్ప స్వామికి శుక్రవారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన మంజుల, ప్రతాప్‌కుమార్ దంపతులు స్వర్ణ రుద్రాక్ష మాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంతోష్, సునీల్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గోలెపు చంద్రమౌళి, బసప్ప, విశ్వం, రాఘవేందర్, చింటు, ప్రవీణ్, ముత్యాలు, రాజావరప్రసాద్, హర్షవర్ధన్ గౌడ్, శశికుమార్, శ్యాం, శ్రీకాంత్, చరణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.